

# కథ

**సర్వజిత్**

# బతకనేర్చినవాడు

సాయంత్రం సందడిగా ఉన్న బీసెంట్ రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్న గోపాలరావు మనసు పరి పరి విధాల ఆలోచనలతో సతమతమవుతోంది.

మరునాడు ఆదివారం కావడం, ఆ రోజు ఉగాది పండుగ కావడంతో రోడ్డు మరీ రద్దీగా ఉంది. బజారులో పని ఉండి వచ్చేవాళ్లు, ఆ వచ్చే వాళ్లకి తోడుగా వచ్చేవాళ్లు, సందడిగా ఉన్న బజారులోని సరదాని అనుభవించడానికి వచ్చేవాళ్లు- మొత్తంమీద మనిషీ మనిషీ రాసుకునేంత రద్దీగా ఉందక్కడ.

అపురూపంగా మూడు రెబ్బలు వేపపువ్వు కట్టి రెండు రూపాయలకి, నాలుగు మామిడి రెమ్మలు మూడు రూపాయలకీ, దాంతోబాటు ఒక మామిడికాయ పది రూపాయలకీ అమ్ముతున్నారు. ఆ అమ్మేవాళ్ల అరుపులు ఆ సందడితో గోలగోలగా ఉన్నాయి.

''బజారుకి వెళుతున్నారా? వచ్చేప్పుడు ఓ మామిడికాయ, నాలుగు మామిడి రెమ్మలు, కాస్త వేపపువ్వూ కొనుక్కురండి...రేపు ఉగాది'' గోపాలరావు చెప్పులేసుకుని బయలుదేరుతుంటే భార్య కామాక్షి చెప్పింది.

''అలాగేలే'' అన్నాడు గోపాలరావు.

సివిల్ సప్లయి ఆఫీసులో సెక్షన్ ఆఫీసరుగా పని చేసి ఆర్నెల్లు కిందటే అతడు పదవీ విరమణ చేశాడు. అటు ఆఫీసునుంచీ, ఇటు పి.ఎఫ్. ఆఫీసు నుంచీ రావలసినవన్నీ వచ్చేశాయి. పోయిన నెల నుంచి పెన్షన్ కూడా మొదలైంది.

ఇద్దరు మగపిల్లల్లో పెద్దవాడు మోహన్ హైదరాబాద్‌లోనూ, రెండోవాడు వెంకట్ చెన్నైలోనూ కార్పొరేట్ స్థాయి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కూతురు రాధ విశాఖలో ఉంటోంది. అల్లుడికి పోర్టులో ఉద్యోగం. మగపిల్లలకీ పెళ్ళిళ్ళయిపోయాయి. ఎవరూ ఎవరి మీదా ఆధారపడాల్సిన అవసరం లేని జీవితాలు.

ఉద్యోగం నుంచి నెల్లూరులో పదవీ విరమణ చేసిన గోపాలరావు విజయవాడలో సొంతింట్లో స్థిరపడ్డాడు. పదవీ విరమణ సందర్భంగా చేతికొచ్చిన డబ్బు ఎక్కడేనా వడ్డీ వచ్చే విధంగా ఏర్పాటు చేసుకుంటే, పెన్షనూ, ఆ వచ్చే వడ్డీ డబ్బూ కలిపి చీకూ చింతా లేకుండా, పిల్లల్ని ఇబ్బంది పెట్టకుండా బ్రతికెయ్యొచ్చనుకున్నాడు గోపాలరావు.

''నీకేది బావుంటే అది చెయ్యి నాన్నా. అది కష్టపడి కూడబెట్టుకున్న డబ్బు. ఇప్పుడు దాంతో స్థలాలు గట్రా కొనాల్సిన అవసరం లేదు. నువ్వు హాయిగా ఎంజాయ్ చెయ్యి'' అని మగపిల్లలిద్దరూ కోరస్‌గా అన్నారు.

''అవున్నాన్నా..వాళ్ల చెప్పినట్లు చెయ్యి'' అన్నది కూతురు.

తన పిల్లలు అన్న మాటలకు గోపాలరావు గుండెలనిండా సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. కామాక్షమ్మ కూడా పిల్లల్ని మురిపెంగా చూసుకుంది.

సాధారణంగా తండ్రికి పి.ఎఫ్.వగైరా డబ్బులొచ్చాయనగానే సంతానం కాకుల్లా వాలిపోయి, ఎక్కడెక్కడి ఈతి బాధలూ ఏకరవుపెట్టి అందినంత పట్టుకుపోయే పరిస్థితులు అతడు చాలా చూశాడు.

''ఇద్దరు పిల్లలూ వచ్చారయ్యా. అపార్టమెంట్లు కొనుక్కుంటున్నాం అన్నారు. మనవళ్లకి ఇంజనీరింగ్ ఫీజులన్నారు. అమ్మాయి అయితే అనారోగ్యం అంటూ తెగ ఆయాస పడిపోయింది. మనసు చంపుకోలేకపోయానోయ్...ఇలా వచ్చిన పి.ఎఫ్. అమౌంట్ అరగంటలో అలా అయిపోయింది. ఇక గ్రాట్యుటీమీద వచ్చే కొద్దిపాటి వడ్డీ, పెన్షనూ, పిల్లలు ఏవన్నా పంపితే అదే గతి...'' అని తనకన్నా మూణ్ణెల్ల ముందు రిటైరయిన తన కొలీగ్ సుందరం చెప్పుకున్న బాధ గోపాలరావుకు గుర్తొచ్చింది. అలా ఆలోచిస్తే తన పిల్లలు బుద్ధిమంతులు. తను అదృష్టవంతుడూను అనుకున్నాడు.

బాగా ఆలోచించి తన పి.ఎఫ్.సొమ్మూ, గ్రాట్యుటీ సొమ్మూ ఒకచోట మదుపు పెట్టాలని, తాత్కాలికంగా మూడు నెలల కాలానికి బ్యాంకులో డిపాజిట్ చేశాడు గోపాలరావు.

ఆ విషయమై గోపాలరావు ఆలోచిస్తున్న సమయంలోనే పదిహేను రోజుల కిందట ఓ రోజు బీసెంట్ రోడ్డులో అతడికి తారసపడ్డాడు రంగసాయి. గోపాలరావుకి బి.ఏ.లో క్లాస్‌మేటే రంగసాయి. రైల్వేలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. అంతకుముందు మూడునెలల కిందట ఇలాగే రోడ్డుమీద కనిపించిన రంగసాయికీ, ఇప్పుడు కనిపించిన రంగసాయికీ చాలా తేడాగా అనిపించింది గోపాలరావుకి. ఎదురుగా వచ్చి 'హలో గోపాల్' అనగానే మొదట్లో గుర్తుపట్టలేకపోయాడు గోపాలరావు.

రంగసాయి మామూలు ప్యాంటుమీద టీ షర్టు వేసుకున్నాడు. చేతిలో ఓ హ్యాండ్ బ్యాగు. నెత్తిన ఓ టోపీ. గోల్డ్ కలర్ ఫ్రేమున్న కళ్లజోడు-మూడు నెలల కిందట అతనికీ ఇప్పటి అతనికీ పోలికే లేదు. మూడు నెలల కిందట ఖద్దరు చొక్కా వేసుకుని, జరీ అంచు పంచె కట్టుకున్నాడు. అప్పుడూ చేతిలో హ్యాండుబ్యాగు ఉంది. నుదుటన కుంకుమబొట్టు కూడా ఉన్నట్లు గుర్తు. ఇప్పుడు కళ్లజోడు స్టైలు మారింది. 'గెటప్ మార్చేశావ్! గుర్తు పట్టలేక పోయా'' అన్నాడు గోపాలరావు నవ్వుతూ.

'గెటప్ మార్చకపోతే ఎలా? త్రీ మంత్స్‌కే ఇప్పటికే ఎంత మార్పొచ్చింది మరి? సరే! ఏమిటి సంగతులు?'' మిత్రుడి రెండు భుజాల మీదా చేతులు వేసి అడిగాడు రంగసాయి.

''ఏమున్నాయ్! మామూలే..రిటైరయ్యాను..తెలుసుగా'' గోపాలరావు అన్నాడు.


''తెలుసు..తెలుసు..గతంలో మనం కలుసుకున్నప్పుడు చెప్పావ్. మళ్లీ ఎక్కడేనా చేద్దామనుకుంటున్నావా?'' అడిగాడు రంగసాయి. టోపీ ఓసారి తీసుకుని జేబురుమాలుతో జుట్టు తుడుచుకుని మళ్లీ టోపీ పెట్టుకున్నాడు సాయి. అతడికీ జుట్టు సగం ఊడిపోయింది.

''లేదు..ఇంకెక్కడా చెయ్యను'' స్థిరంగా చెప్పాడు గోపాలరావు.

''అవున్లే..నీకు చెయ్యాల్సిన అవసరం మాత్రం

ఏం ఉంది. పిల్లలు సెటిల్ అయిపోయారు. ఇక నువ్వు, నీ వైపే కదా.. ఇంకేమిటి సంగతులు?'' రోడ్డుకు ఓ ప్రక్కగా జరుగుతూ అడిగాడు రంగసాయి.

ఏమీ లేవన్నట్లు పెదివి విరిచాడు గోపాలరావు.



''అవునూ! మనవాళ్లెవరైనా కనిపించారా ఈమధ్య?'' రంగసాయి అడిగాడు. మనవాళ్లంటే బి.ఏ.లో తమ క్లాస్‌మేట్స్ సంగతి. ఎవరూ కనపడలేదన్నట్లు గోపాలరావు తల అడ్డంగా ఊపాడు.

''ఒన్ మంత్‌బ్యాక్ అనుకుంటా. థామస్ కనిపించాడు సెంట్రల్‌లో. అదే పొట్టిగా లావుగా, గుమ్మటంలా ఉండేవాడు చూడు.. అతడు.. మనిషి బక్కగా అయిపోయాడు. సుగర్‌ట! బాగా ఎక్సర్‌సైజులు చేయమని చెప్పాను. సరే! ఇంకేమిటి సంగతులు?'' మళ్లీ అడిగాడు రంగసాయి.




ఏమీ లేవన్నట్లు నవ్వి ఊరుకున్నాడు గోపాలరావు. ఎప్పుడేనా రంగసాయి అలా కనిపించినప్పుడు 'సంగతులేమిటి' అని పదే పదే అడుగుతూనే చాలా సంగతులు అతడే చెబుతుండడం, ఆసక్తిగానో, కొన్ని అనాసక్తిగానో వింటుండడం గోపాలరావుకి అలవాటు.

అంతకు ముందెప్పుడో ఓసారి ఇలాగే కనిపించినప్పుడు గోపాలరావుని మార్నింగ్ వాక్ చేయమని సలహా ఇచ్చాడు రంగసాయి. తను ఇరవైమందికి యోగా క్లాసులు నిర్వహిస్తున్నాననీ, అతడిని కూడా రమ్మనమనీ మరీ మరీ చెప్పాడు. యోగా ప్రయోజనం గురించి పావుగంట పైగా చెప్పాడు. కానీ గోపాలరావుదేనికీ వెళ్లలేదు. మరోసారి కనిపించి ముప్ఫయి మందికి కరాటే నేర్పుతున్నానన్నాడు. అంతేకాదు సూపరింటెండెంటు ఇంజనీర్లు, డిప్యూటీ కలెక్టర్ల స్థాయి ఆఫీసర్లు- ఇలా చాలా పెద్దవాళ్లు తన దగ్గరికి యోగా క్లాసులకి వస్తుంటారన్నాడు. హోమియో వైద్యం కూడా చేస్తున్నానన్నాడు. సిటీలో పెద్దవాళ్ల పేర్లు చెప్పాడు. కొత్తగా కెరీర్ ఓరియంటేషన్ మీద లెక్చర్లిస్తున్నానన్నాడు. ఇన్ని కళల్లో అతడికి ప్రావీణ్యం ఎలా వచ్చిందా అని గోపాలరావు ఆశ్చర్యపోయాడు కూడా. ఎందుకంటే -రంగసాయి బి.ఏ. నాలుగేళ్లు పైనే చదివాడు.

మరోసారి కనిపించినప్పుడు- తన పెద్ద కొడుకు చేత టీవీలు, రేడియోలు, ఫ్రిజ్‌లు రిపేరింగ్ షాప్ పెట్టించాననీ, మీకు గానీ, మీకు తెలిసినవారికి గానీ అవసరం ఉంటే రమ్మనమనీ- ఓ విజిటింగ్ కార్డు కూడా ఇచ్చాడు రంగసాయి.

అలా రంగసాయి కనిపించినప్పుడల్లా ఏదో ఒక కొత్త విషయం చెబుతూండడం, గోపాలరావు ఆశ్చర్యపోవడం జరుగుతూనే ఉంది.

అంతేకాదు- అతని భార్య సత్యవాణి కూడా ఇంట్లోనే ఉంటూ స్కీములు వగైరా నిర్వహిస్తుందిట. రంగసాయి భార్యగాకన్నా, ఆ చుట్టుపక్కల స్కీముల సత్యవాణిగా ఆమె ప్రసిద్ధురాలని రంగసాయే ఓసారి చెప్పాడు గోపాలరావుకి. రెండో అబ్బాయి చేత ఈమధ్యనే వాటర్ బాటిల్ ఫ్యాక్టరీ పెట్టించాడట.

''వీటన్నిటికీ పెట్టుబడి ఎక్కడిది?'' అని అమాయకంగా గోపాలరావు ప్రశ్నిస్తే-

''బ్యాంకుల్లో బోల్డు స్కీములున్నాయి. ఎవడినో ఒకడిని పట్టుకుంటే ఏదో ఒక దారి దొరక్కపోదు గోపాల్.. బ్యాంక్ ఏజీఎం నాకు మంచి ఫ్రెండు. మనం అడగాలే కాని కాదనే వాడు లేడు'' అని తేలిగ్గా నవ్వేశాడు రంగసాయి.

అతడి ఇద్దరు కొడుకులూ రాజకీయాలలో తిరుగుతారుట. కాకపోతే ఎప్పుడూ అధికార పార్టీలోనే ఉంటారు. అందుచేత బ్యాంకు లోన్లు గట్రా తేలిగ్గానే సంపాదించగలరు. కాలేజీలో చదువుకునేటప్పుడు, తర్వాత ఉద్యోగంలో చేరినప్పుడు కూడా రంగసాయి సైకిలు కొనుక్కో-లేకపో

యాడు. కానీ, జీవితంలో బ్రతకటం నేర్చుకున్న తరువాత స్కూటర్ కొన్నాడు. ఏడాదికి అది అమ్మేసి మోటార్ బైక్ కొన్నాడు. ఏమైనా, ఎదగడం అంటే రంగసాయిని చూసి నేర్చుకోవాలి కాబోలని చాలాసార్లు అనుకున్నాడు గోపాలరావు. కానీ, జీవితంలో అన్ని వేషాలు వెయ్యడం తనలాంటి వాళ్లకి సుతరామూ చేతకాని విషయమని కూడా అతడు ఒప్పేసుకున్నాడు.

అసలు మనిషి ఇన్ని వేషాలు ఎందుకు వేయాలి అని అమాయకంగా ప్రశ్నించుకుని తనలోతను సతమతమవుతున్న గోపాలరావుకి ఓరోజు రంగసాయి ఇలా చెప్పాడు-

''లక్షణంగా రైల్వేలో ఉద్యోగం చేసుకుంటూ ఈ బిజినెస్సులూ, యోగాలు వగైరా ఏమిటనుకుంటున్నావ్ కదూ గోపాల్?! ఉద్యోగం అంటే ఏమిటి? కూపస్థ మండూకంలా ఒకచోటే పడి కొట్టుకోవడం. ఈ ఎగస్ట్రా వేషాలున్నాయి చూశావూ...బోల్డంత ప్రపంచాన్ని చూడ్డవన్న మాట! అయినా ఉద్యోగంలో ఏముందయ్యా? ఏడాదికి రెండొందలో, మూడొందలో ఇంక్రిమెంట్లు, పెరుగుతుందో ఛస్తుందో తెలీని డి.ఏ., ఆ వెధవనీ, ఈ వెధవనీ కాకా పట్టుకుంటే వచ్చే ప్రమోషనూ....అంతే కదా?! అవన్నీ కూపస్థ మండూకాలకే...ఏవంటావ్?''

రంగసాయి చెప్పిన ఈ ఉద్యోగ నిర్వచనానికి గోపాలరావు మనస్సు ఎంతమాత్రం అంగీకరించలేదు. తనకి ఉద్యోగం సంతృప్తినిచ్చింది. ఎవరి కాళ్ళూ పట్టుకోకుండానే ప్రమోషన్లు వచ్చాయి. కానీ, తన మనస్సులో భావాలేమీ రంగసాయికి చెప్పలేదు. అతడు చెప్పింది విని ఊరుకున్నాడు. ఏమైనా సరే రంగసాయి సామాన్యుడు మాత్రం కాదని అనుకున్నాడు.

అటువంటి బహుముఖ ప్రజ్ఞావంతుడిలా వెలిగిపోతున్న రంగసాయి మూణ్ణెల్ల క్రిందట టిషర్టు, నెత్తిమీద టోపీతో మోడరన్‌గా కనిపించినప్పుడు-

''నీకు రావలసిన పి.ఎఫ్.డబ్బూ, గ్రాట్యుటీ వగైరాలన్నీ వచ్చేశాయన్నమాట. నువ్వు జాగ్రత్తపరుడివే అనుకో...నీకు నేను చెప్పనక్కర్లేదు. ఏం చేశావ్ ఆ అమౌంట్? లేదా ఏం చేయాలనుకుంటున్నావ్? ఎందుకడుగుతున్నానంటే - బ్యాంకుల్లోనా పెద్దగా వడ్డీ వచ్చి చావదు. బయట ఎక్కడేనా ఇవ్వడానికి ఏ మనిషినీ నమ్మలేకుండా ఉన్నాం. ఏవంటావ్. అంచేత నేనో సలహా చెబుతాను ఆ పని చెయ్యి. ఏం లేదు మా మూడోవాడు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. ముఖ్యమైన బంధువుల దగ్గర మాత్రం తీసుకున్నాం. వాళ్లకి రూపాయిన్నర వడ్డీ ఇస్తున్నాడు. ఠంచనుగా నెల ఫస్టుకి. నీకు మాత్రం రెండ్రూపాయల వడ్డీ యిప్పిస్తాను. మా వాడి దగ్గర పెట్టు నీ డబ్బు. నేనెలాగూ గ్యారంటీగా ఉంటాను. ఒకళ్లిద్దరు మా బంధువులు, ఫ్రెండ్సు డబ్బు ఇస్తామంటున్నా మా వాడు ససేమిరా అన్నాడు. నేనూ వద్దన్నాను. నీ సంగతి వేరు. సిన్సియరు ఫ్రెండువి. పద్ధతైన వాడివి. నీకు హెల్ప్ చెయ్యకపోతే ఎవరికి చేస్తాను'' అన్నాడు.



వెంటనే ఏమీ మాట్లాడలేదు గోపాలరావు.

''బలవంతం ఏమీ లేదు గోపాల్! ఏదో నీకు నాలుగు డబ్బులెక్కువొస్తాయని నా సలహా. అసలు మావాడే ఎవరి దగ్గరా తీసుకోనంటున్నాడు. కానీ నీ విషయం వేరు. పది రోజుల్నించీ ఆలోచిస్తున్నాను నీ విషయం. అయ్యో మన వాడికి డబ్బులొస్తాయి. పాపం ఎక్కడ డిపాజిట్ చేస్తాడో..అసలే రోజులు బాగా లేవు అని..ఏమయితే అదయిందిలే అని మా వాడితో మాట్లాడాను. ముందు వద్దన్నాడు. కాదురా మన అంకుల్ అని నచ్చచెప్పేసరికి సరే అన్నాడు. అంచేత నువ్వు ఆలోచించి నేను చెప్పినట్లు చెయ్యి..'' అని గోపాలరావు రెండు భుజాలూ తడిమి, రెండు చేతులూ పట్టుకుని, ఆప్యాయంగా, శ్రేయోభిలాషిలా చెప్పాడు రంగసాయి.

అలాగే అన్నట్లు గోపాలరావు తలూపాడు.

''ఆలోచించు..నేను మళ్లీ ఫోన్ చేస్తాను'' అనేసి వెళ్లిపోయాడు రంగసాయి.

వారం రోజులు పోయాక ఫోన్ చేశాడు రంగసాయి. గోపాలరావు ఊళ్లో లేడు. మళ్లీ ఆ రోజు ఉదయం ఫోన్ చేశాడు. అప్పుడు గోపాలరావు వీధిలోకెళ్లాడు.

రంగసాయి చెప్పిన విషయం పిల్లలిద్దరికీ చెబితే వాళ్లు వద్దన్నారు. బ్యాంకుల్లోనే డిపాజిట్ చేయమన్నారు. నాలుగు డబ్బులు ఎక్కువ వస్తే చేదా అన్నది గోపాలరావు మనసులో వున్నమాట. ఎటూ తేల్చుకోలేకపోతున్నాడతడు. రంగసాయి మళ్లీ ఫోన్ చేస్తే ఏం చెప్పాలా అని ఆలోచిస్తూ బజారుకి బయలుదేరాడు సాయంత్రం. బజారంతా ఒకటే రద్దీ.

బీసెంట్ రోడ్డులో ప్రవేశిస్తుంటే కనిపించాడు వెంకటాద్రి. గోపాలరావుకి అతడూ బి.ఏ.లో క్లాసుమేటే. అతడికి పటమటలో పెయింట్స్ షాపుంది. వాళ్ల నాన్న వ్యాపారం ఇప్పుడు అతడు చూసుకుంటున్నాడు. ఆప్యాయంగా షేక్ హ్యాండిచ్చుకున్నారు.

## శ్రీమతి శిల్పాకుంద్రా

***పొడుగుకాళ్ల సుందరి 34 ఏళ్ల శిల్పాశెట్టి మొత్తానికి శ్రీమతిగా మారింది. ఇకపై ఆమె 'శిల్పాశెట్టి'గా కాకుండా 'శిల్పా కుంద్రా'గా పిలవబడుతుందని ప్రకటించుకున్నారు. ఎంతో హంగామాగా జరిగిన ఈ వివాహకార్యక్రమానికి ముఖ్య అతిథులెందరో రావడం మామూలే. అయితే విశేషం ఏంటంటే- శిల్పా భర్త రాజ్‌కుంద్రా మొదటి భార్య కూడా హాజరు కావడం అనేది ప్రత్యేకమైన విశేషం. అసలు శిల్పాశెట్టిపై మనసుపడి ఆమెని పెళ్లాడేందుకే రాజ్ తన మొదటి భార్యకి విడాకులిచ్చాడని కొన్ని వార్తలు వచ్చాయి.***

''ఒకే సిటీలో ఉండి కూడా పరాయి ఊళ్లల్లో ఉన్నట్లు ఏ ఆర్నెల్లకో కలుసుకుంటున్నాం'' వెంకటాద్రి అన్నాడు.

''ఏం చేస్తాం మొన్నటిదాకా నేను ఉద్యోగంలో ఊళ్లు తిరిగాను. నువ్వు వ్యాపారం- తీరికుండదు'' గోపాలరావు అన్నాడు.

''అంతేలే! ఏమిటి విశేషాలు?'' వెంకటాద్రి అడిగాడు.

''రిటైరయ్యాను''

''అవును విన్నాను. మన ఫ్రెండు రామానుజం ఓ రోజు కనిపించి చెప్పాడు. ఇప్పుడు ఖాళీయేగా..నీకు వీలున్నప్పుడు మా షాపుకి రారా..కొంత నీకు కాలక్షేపంగానూ, నాకు కాస్త రిలాక్స్‌గానూ ఉంటుంది'' వెంకటాద్రి చెప్పాడు.

అలాగే అన్నట్లు తలూపి- ''ఆ మధ్య రంగసాయి కనిపించాడు'' అని చెప్పాడు గోపాలరావు.

''ఏ వేషంలో?'' టక్కున అడిగాడు వెంకటాద్రి.

నవ్వి చెప్పాడు గోపాలరావు.

''ఏవన్నాడేం?''

అతడి ప్రశ్న సరిగ్గా అర్థంకాక మిత్రుడి ముఖంలోకి చూశాడు నుదురు చిట్లించి గోపాలరావు.

''తన వ్యాపారాలు, సంఘసేవలూ చెప్పాడా..ముఖేష్ అంబానీ పి.ఏ.తమ్ముడూ, సి.ఎం. పేషీలో పి.ఏ. తనకి బాగా ఫ్రెండ్సని కూడా చెప్పి ఉంటాడే..'' వెంకటాద్రి నవ్వుతూ అన్నాడు.

''అవును. ఇంకా చాలామంది గురించి చెప్పాడు. ఈమధ్య జిల్లా కలెక్టర్‌తో కూర్చుని గంటసేపు మాట్లాడానని కూడా చెప్పాడు..'' తనలోని ఆశ్చర్యాన్ని కప్పి పుచ్చుకుంటూ అన్నాడు గోపాలరావు.

''నిన్నేమైనా డబ్బు అడిగాడా?'' వెంకటాద్రి సూటిగానే అడిగాడు.

గోపాలరావుకి ఏం చెప్పాలో తోచలేదు. అవును కాదన్నట్లు తల ఊపాడు.

''మన రామానుజం ఏభైవేలిచ్చాట్ట మూడేళ్ల కిందట. మనిషి కనపడడు. ఫోన్‌కి దొరకడు. ఆఫీసుకి ఎప్పుడు వెళ్లినా ఉండడు. థామస్‌గాడు కూడా ఓ లక్ష ఇచ్చాట్ట. ఆ మధ్య వాడికి అదే థామస్ గాడికి రోగం వచ్చి పీకలమీదకొస్తే డబ్బు ఎంతగా అడిగినా అదిగో ఇదిగో అన్నాడేకాని పైసా ఇచ్చిన పాపాన పోలేదట. ఎక్కువ వడ్డీకి ఆశపడి ఇద్దరూ ఇచ్చారు. వడ్డీ లేదు, అసలూ లేదు. రంగసాయి ముగ్గురు కుర్రాళ్లూ బేవార్స్ వెధవలు. ఒక్కడికీ చదువంట లేదు. రాజకీయ నాయకుల్ని పట్టుకుని పిల్లల పేర్లతో ఏవో పథకాలు పేరు చెప్పి బ్యాంకుల్లో లోన్లు తీసుకుని ఎగనామం పెట్టేశాట్ట. బికాంలో సత్తిరెడ్డి అని మనకో ఫ్రెండు ఉండేవాడు గుర్తుందా. అతడిక్కడ ఆంధ్రాబ్యాంకులోనే పనిచేస్తున్నాడు. వాడి బ్యాంకులోనే మన సాయిగాడి లోన్ల భాగోతం...''

వెంకటాద్రి ఇంకా రంగసాయి విషయాలే చెబుతున్నాడు. గోపాలరావుకి తల తిరిగిపోయింది. ఇక మిత్రుడు చెప్పే విషయాలు అతడికి వినిపించడం లేదు. మరో పావుగంట ఏవో విషయాలు మాట్లాడి వెంకటాద్రి వెళ్లిపోయాడు.

అతడు వెళ్లిపోయాక నెమ్మదిగా నడుచుకుంటూ బయలుదేరిన గోపాలరావు మనస్సు గందరగోళంగా తయారయ్యింది. పరి పరి విధాల ఆలోచనలతో సతమతమవుతోంది.

వెంకటాద్రి కనిపించి ఉండకపోతే తను ఎంత ఊబిలో దిగబడిపోయి ఉండేవాడు? ఆపద్బాంధవుడిలా తనను మేల్కొలిపిన వెంకటాద్రిని మనసులోనే అభినందించుకున్నాడు గోపాలరావు.

'అయినా ఇంత నిస్సిగ్గుగా మనుషులు ఎలా ప్రవర్తిస్తారు? నిలువెల్లా అబద్ధాలు పేర్చుకుంటూ ఎలా జీవిస్తారు?' సమాధానం దొరకని ప్రశ్నలు మెదడంతా ఆక్రమించాయి.

సందడిగా, రద్దీగా ఉన్న రోడ్డులో ఏభై గజాల దూరంలో, కార్నర్‌లో తెల్లటి దుస్తుల్లో ఇన్‌షర్టు చేసుకుని ఎవరితోనో చేతులూ తలా తిప్పేస్తూ మాట్లాడుతున్న రంగసాయి చటుక్కున కనిపించాడు గోపాలరావుకి.

ఒక్కసారి గుండె వేగం హెచ్చింది. దడదడలాడింది. క్షణం సేపు ఆగి, ముఖాన్ని మరో పక్కకి తిప్పుకుని ప్రక్కరోడ్డులోకి తిరిగాడు గోపాలరావు రంగసాయి తనను చూశాడా అనుకుంటూ..!

## టాప్ పొజిషన్లో తమన్నా

**మిల్కీవైట్** భామ తమన్నాకి తమిళ సినీ రంగంలో రోజు రోజుకీ క్రేజ్ పెరుగుతోంది. ఆమె తాజాగా నటిస్తున్న 'పయ్యా' సినిమా కచ్చితంగా బంపర్ హిట్ అయ్యే సూచనలున్నాయని కోలీవుడ్ జనాలు చెప్పుకుంటున్నారు. ఇందులో సూర్య సోదరుడు కార్తీ హీరోగా నటిస్తుంటే హీరోయిన్‌గా నటిస్తున్న తమన్నా తన అందచందాల్ని ఎంచక్కా ఆరేసిందిట. లింగుస్వామి లాంటి సత్తావున్న డైరెక్టర్ ఈ సినిమాని డైరెక్ట్ చేస్తున్నాడు కూడా. 'పయ్యా' తర్వాత తమన్నా తమిళ రంగంలో నంబర్ వన్ హీరోయిన్ అయినా ఆశ్చర్యం లేదు అంటున్నారు.

